క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కీసర: రాంపల్లిదాయర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33/11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని కీసర విద్యుత్ ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రాంపల్లిదాయర, కీసరదాయర, బర్సిగూడ, వన్నిగూడ, జేఎస్ఎంయూఆర్, జాఫర్‌గూడ, కెల్లార్ ఇండ్రస్టీస్, బొగారం గ్రామాల్లో ఉదయం 10 నుంచి సా.5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఏఈ తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



ఘట్‌కేసర్: స్నేహితుడి కూతురు వివాహానికి అతడి స్నేహితుల బృందం ఎదులాబాద్‌లో సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. ఎదులాబాద్ జెడ్పీ పాఠశాలలో 1999–2000వ విద్యా సంవత్సరంలో పదో తరగతికి చెందిన విద్యార్థులు తమ స్నేహితుడు నజీర్ కూతురు వివాహానికి రూ.58,500 నగదు సోమవారం అందజేశారు.

ఒప్పందం



అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌తో ఎంఓయూ ఒప్పందం కుదుర్చుకుంటున్న సీఎంఆర్ఐటీ

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ కళాశాల యాజమాన్యం గత రెండ్రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా కేంద్రంలో జరిగిన శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ స్టార్టప్ జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌తో సీఎంఆర్ఐటీ కళాశాల ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకున్నారు. కళాశాల డైరెక్టర్ జంగారెడ్డి, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వినీత్ గుంజన్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ఘట్‌కేసర్: శ్రీగట్టుమైసమ్మ అమ్మవారి జాతర హుండీ ఆదాయం ఆలయం ఆవరణలో ఈఓ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన వివిధ హుండీల ద్వారా రూ.2,12,180 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ పేర్కొన్నారు. వైస్ చైర్మన్ మాధవరెడ్డి, జంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్, శ్రీకాంత్, అర్చకులు రవీంద్రశర్మ పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ఆదుకోవాలి



కృషి హోమ్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మేడ్చల్: రాష్ట్రంలో ఉన్న అనాథ పిల్లలకు అన్ని రకాలుగా ప్రభుత్వం అండగా ఉండి ఆదుకోవాలని మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా గౌడవెల్లిలోని కృషి హోంలో అనాథ పిల్లలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పరుశరాంమాదిగ, బాలనర్సింహ, శికుమార్, భానుచందర్, నర్సింహ రావు, రమేష్‌బాబు, మనోజ్, మహేష్, రవి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును వెంటనే పూర్తి చేయాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో పెండింగ్‌లో ఉన్న 100 ఫీట్లతో ప్రధాన రహదారిని వెంటనే పూర్తి చేయాలని జవహర్‌నగర్ బీజేపీ ఆధ్వర్యంలో మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్ బీజేపీ అధ్యక్షుడు రంగుల శంకర్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో దాదాపు ఎనిమిదేళ్లుగా ప్రధాన రహదారి విషయంలో శిలాఫలకాలకే పరిమితమయ్యాయని, వెంటనే అధికారులు, అధికార పార్టీకి చెందిన నాయకులు రోడ్డును వెంటనే పూర్తి చేయాలన్నారు. జీవో 59 పేరుతో ఇంటి స్థలాల రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న జవహర్‌నగర్ ప్రజలకు 2014లో స్థలం విలువకు భిన్నంగా ప్రస్తుతం ఉన్న విలువకు కూడా అధిక రేటు విలువతో లక్షల రూపాయల్లో డిమాండ్ నోటీసులు ఇవ్వడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అదేవిధంగా జవహర్‌నగర్‌లో ఆటస్థలం, పార్కును వెంటనే మంజూరు చేయాలన్నారు. నాయకులు కమల్, శివకేశవ్, మల్లేష్‌గౌడ్, మహేశ్వరిగౌడ్, రాజేందర్‌రెడ్డి, ముత్యం సుజాత, రామ్‌నాయక్, సన్ని, రాఘవేంద్రచారి, రాజునాయక్, మహేష్‌గౌడ్, శ్రావణ్‌కుమార్, గణేష్, చందు, సాయిరాం, వంశీ, యాదగిరి, అరుణ్, లక్ష్మీరెడ్డి, లక్ష్మీ, ఖైరున్నీసా, సూర్యచారి, యాదగిరి, తులసిరామ్ పాల్గొన్నారు.

‘ప్రజావాణి’కి 77 ఫిర్యాదులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజావాణికి వచ్చే సమస్యలను తక్షణమే పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాలులో జిల్లా నుంచి వచ్చిన ప్రజలకు సంబంధించి 77 అర్జీలను జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌తో ఆయన కలిసి స్వీకరించారు. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



సీఎం దత్తత మండల కేంద్రంలో..

మీ సేవా కేంద్రం కరువు!

సీఎం కేసీఆర్ ధరణి ప్రారంభించిన మూడుచింతలపల్లి సెంటర్‌లో మీ సేవ లేకపోవడంతో ముక్కున వేలేసుకుంటున్న జనం

- కొల్తూర్‌లో మండలానికి సంబంధించిన మీసేవా సెంటర్
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్జీదారులు
- మండల కేంద్రానికి మార్చాలంటూ విన్నపాలు



ఆరేళ్ల క్రితం మూడుచింతలపల్లి గ్రామ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్ (ఫైల్)



మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం

శామీర్‌పేట్: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో ఆరేళ్ల క్రితం 13 గ్రామాలను కలుపుతూ మూడుచింతలపల్లి కేంద్రంగా నూతన మండలం ఏర్పడింది. సీఎం ఆదేశాలతో మండలం ఏర్పడటంతో సకల సౌకర్యాలు అందుబాటులో ఉంటాయనుకున్న మండల ప్రజల ఆశలు అడియాశలయ్యాయి. అంతేకాక రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌ను స్వయంగా సీఎం కేసీఆర్ ఇక్కడే ప్రారంభించారు. ఇంకేముంది ఏళ్ల తరబడి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలతో పాటు ప్రభుత్వ కార్యకలాపాలన్నీ అందుబాటులో ఉంటాయని మండల ప్రజలు ఆశించారు. కానీ నేటికీ అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతుండగా ఉమ్మడి శామీర్‌పేట మండలం చాలా కాలం నుంచి కొనసాగుతున్న కొల్తూర్ గ్రామంలోని మీ సేవ నేటికీ అక్కడే ఉంది. కానీ నూతనంగా ఏర్పడిన మూడుచింతలపల్లి మండలంలో మాత్రం మీ సేవా కేంద్రం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మండలానికి చివరి గ్రామంలో మీ సేవాతో తిప్పలు...

మూడుచింతలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించినప్పటికీ మండల కేంద్రంలో ఉండాల్సిన మీ సేవ సెంటర్ అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు, రైతులు, జనన మరణ ధృవీకరణ పత్రాలు, ఇతరత్రా ప్రభుత్వ పత్రాల కొరకు దరఖాస్తు చేసుకోవడానికి అందుబాటులో మీ సేవ కేంద్రం లేదు. ‘పేరు పెద్ద ఊరు దిబ్బ’ అన్నట్లుగా మూడుచింతలపల్లి మండల పరిస్థితి దాపురించిందని ప్రజలు మండిపడుతున్నారు. మండల కేంద్రంగా ప్రకటించి ఆరేళ్లు గడుస్తున్నప్పటికీ శాశ్వత కార్యాలయాల సమూహం లేక ఏదైనా అవసరమైతే మళ్లీ శామీర్‌పేటకు వెళ్లాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

నేటికీ ఉమ్మడి మండలం లోనివే...

శామీర్‌పేట మండల కేంద్రంలో రెండు మీ సేవా కేంద్రాలు ఉండగా సీఎం చొరవతో ఏర్పడిన మూడుచింతలపల్లి మండలంలోని చివరి గ్రామమైన కొల్తూర్‌లో ఒక మీ సేవ కేంద్రం ఏర్పడింది. దీంతో మూడుచింతలపల్లి మండలంలోని కొల్తూర్ మినహా మిగిలిన గ్రామాల ప్రజలు మండలానికి చివరి గ్రామమైన కొల్తూర్‌కు వెళ్లి దరఖాస్తులు చేసుకుంటున్నారు. వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చి అక్కడి నుంచి మళ్లీ కొల్తూర్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకుంటున్నారు. అనంతరం సర్టిఫికెట్ల కోసం మళ్లీ కొల్తూర్‌కు ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఆ గ్రామానికి సరైన బస్సు సౌకర్యం సైతం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి మూడుచింతలపల్లి మండల కేంద్రంలో మీసేవ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొల్తూర్‌కు బస్సు సౌకర్యం కూడా లేదు

మూడుచింతలపల్లి మండల కేంద్రంలో మీసేవ లేక కొల్తూర్‌కు వెళ్లాల్సి వస్తోంది. అక్కడికి వెళ్లినా సర్వర్ రావడం లేదంటున్నారు. మండల కేంద్రమైన మూడుచింతలపల్లి నుంచి కొల్తూర్‌కు బస్సు సౌకర్యం కూడా లేదు. దీంతో మీ సేవా కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మండలానికి ఒక్కటే ఉండటంతో రద్దీ ఎక్కువ ఉంటుంది. దీంతో దరఖాస్తు చేసుకోవడానికి రోజుల తరబడి తిరగాల్సి వస్తోంది.

– వెంకటేష్‌నాయక్, లక్ష్మాపూర్ తండా

మీ సేవా ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి



మూడుచింతలపల్లి మండలం ఏర్పడి ఆరేళ్లు గడుస్తున్నా నేటికీ మీ సేవ కేంద్రం లేకపోవడం విడ్డూరం. రాష్ట్ర ప్రభుత్వం మండలాన్ని ఏర్పాటు చేయడంలో ఉన్న శ్రద్ధ, ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో లేదు. సీఎం కేసీఆర్ దత్తత తీసుకున్న మండలంలోనే అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాల కొనసాగింపు, మీ సేవ సైతం లేక పోవడం హాస్యాస్పదం. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి ప్రజల సౌకర్యార్థం మీ సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

– నర్సింహులుయాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు

‘ఆజాదు హిందు ఫౌజు దళపతి నేతాజీ’

- మేడ్చల్ నియోజకవర్గంలో ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి
- ఆయనకు నివాళులర్పించి సేవలను కొనియాడిన ప్రముఖులు



ఘట్‌కేసర్: ఘనాపూర్‌లో నేతాజీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, నేతాజీ యువజన సంఘం సభ్యులు అభిలాశ్‌గౌడ్, మణిశరణ్‌గౌడ్, చాణక్య, శివ, మల్లికార్జున్

మేడ్చల్ జోన్ బృందం :భారత స్వాతంత్ర్య సమర యోధుడు, భారత జాతీయ సైన్యాధినేత నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు మేడ్చల్ నియోజకవర్గంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలతో పాటు పలు ప్రాంతాల్లో నేతాజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ... ఆజాదు హిందు ఫౌజ్‌ను స్థాపించడంతో పాటు సాయుధ పోరాటంతోనే ఆంగ్లేయులను దేశం నుంచి తరిమికొట్టవచ్చని నమ్మి దానిని ఆచరణలో పెట్టిన మహోన్నత వ్యక్తి నేతాజీ అని అన్నారు. ‘మీరు నాకు రక్తాన్ని ఇవ్వండి.. నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను’ అని చెప్పిన గొప్ప వ్యక్తి సుభాష్ చంద్రబోస్ అని పేర్కొన్నారు. చరిత్రలో దేశం కోసం తన ప్రాణాలకు సైతం లెక్క చేయ కుండా పోరాడిన వాళ్లలో నేతాజీ కూడా ఒకరని, ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.



మేడ్చల్: అత్వెల్లిలో నేతాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దయాకర్‌రెడ్డి, నాయకులు మల్లికార్జున్ స్వామి, జగన్‌గౌడ్, ప్రేందాస్ తదితరులు



మేడ్చల్‌రూరల్: రాయిలాపూర్‌లో నేతాజీకి నివాళులర్పిస్తున్న నాయకులు

మేడ్చల్ అభివృద్ధే ధ్యేయం: మంత్రి మల్లారెడ్డి



బాబా గూడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్: మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నానని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేట్, మూడుచింతలపల్లి మండలాల్లో సోమవారం మంత్రి పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని, మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో ముందు వరుసలో నిలుపుతానన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో గ్రామాలు అభివృద్ధి వైపు అడుగులు వేశాయన్నారు.

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

- శామీర్‌పేట్ మండలంలోని బాబాగూడలో రూ.20 లక్షల నిధులతో అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు.
- మూడుచింతలపల్లి మండలంలోని జగన్‌గూడలో రూ.30 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు పూజలు
- నారాయణపూర్‌లో రూ.20లక్షలతో చేపట్టనున్న అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తారు.
- ఉద్దమర్రిలో రూ.10 లక్షలతో ఏర్పాటు చేయనున్న మల్టిపర్పస్ ఫంక్షన్ హాల్‌కు మంత్రి మల్లారెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీలు ఎల్లుబాయి, హరికమురళి గౌడ్, జెడ్పీటీసీ అనిత, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి

ఘట్‌కేసర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రెండో విడత కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి అన్నారు. ఎన్ఎఫ్‌సీనగర్ రెండో వార్డు కమ్యూనిటీ హాల్లో కమిషనర్ వేమనరెడ్డితో కలిసి కంటి వెలుగు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు పునీరందర్‌రెడ్డి, శిరీష, విమల, రాజేశ్వరీ, సాత్విక్, లక్ష్మీ, మేఘమాల, శివయ్య, యాదగిరిరావు, ఆంజనేయులు, శశికళ, నాగలక్ష్మి, విష్ణువర్ధన్‌రెడ్డి, సంజీవరెడ్డి, మహిపాల్‌గౌడ్, సూరి, సునిత, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా కొనసాగుతోన్న కంటి వెలుగు

కీసర: ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రమాదేవి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన కీసర, అంకిరెడ్డిపల్లిల్లో కొనసాగుతున్న కంటివెలుగు వైద్య శిబిరాన్ని సర్పంచ్‌లు మాధురి, విమలతో కలిసి ఎంపీడీఓ పరిశీలించారు. అదేవిధంగా నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల పరిధిలోనూ కంటివెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయని మండల వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి తెలిపారు.



కళ్లద్దాలు అందజేస్తున్న కౌన్సిలర్ రమాదేవి, కమిషనర్ వేమనరెడ్డి

ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి భూమి పూజ

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం నూతన భవన నిర్మాణానికి సోమవారం గ్రామ సర్పంచ్ బాబుయాదవ్, పాలకవర్గ సభ్యులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రూ.25 లక్షల నిధులతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మానేపల్లి వెంకటేశ్, ఎంపీటీసీ రఘు, వార్డు సభ్యులు మాణిక్యం, శశికుమార్‌యాదవ్, లింగమ్మ, శ్రీకాంత్, జనార్దన్ యాదవ్, నాయకులు శంకరయ్య, రేగు నాగేశ్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గౌడవెల్లి గ్రామంలో..

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రం, పశువైద్యశాల భవనాలకు జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ హరివర్ధన్‌రెడ్డి, సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్‌లు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో అందరూ కలిసి కట్టుగా అభివృద్ధి పనులు చేసి గ్రామాలను అభివృద్ధి దిశలో నడిపించాలన్నారు. గ్రామంలో 60 సంవత్సరాల క్రితం నిర్మించిన భవనాలే ఉన్నాయని, వాటిని ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. రూ.50లక్షలతో నూతన భవనాలు నిర్మిస్తున్నామన్నారు. గ్రామంలో మీసేవా, గ్రంథాలయ భవనం, పోస్టాఫీస్ భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెంటమ్మ, పీఏసీఎస్ చైర్మన్ రందీప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, టీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాజు, వార్డు సభ్యులు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ తదితరులు

గోధుమకుంటలో అభివృద్ధి పనులు ప్రారంభం

కీసర: గోధుమకుంట గ్రామాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దనున్నట్లు గ్రామ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పంచాయతీ పరిధిలోని కృష్ణానగర్ ఫేజ్–2లో సుమారు రూ.15 లక్షల పంచాయతీ నిధులతో చేపట్టనున్న అంతర్గత మురికి కాలువ, సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నోమని ఆంజనేయులు, ఎంపీటీసీ మంచాల కిరణ్ జ్యోతిప్రవీన్, వార్డుసభ్యులు, గ్రామకార్యదర్శి సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ మహేందర్‌రెడ్డి

పనుల పరిశీలన

పోచారం: అన్నోజిగూడలోని వికలాంగుల కాలనీ వద్ద జరుగుతున్న వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులను చైర్మన్ కొండల్ రెడ్డితో పాటు కమిషనర్ సురేష్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రూ.2 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణం జరుగుతోందని, పనులను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ సాయిరెడ్డి, ఏఈ నరేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



బహుమతులు ఇస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని పుడమి స్కూల్స్ ఆధ్వర్యంలో ఖేల్ ఉత్సవ్–2023 పేరిట నిర్వహించిన క్రీడా పోటీల ముగింపు ఉత్సవాల్లో ఆయన పాల్గొని పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గోధుమకుంట సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి, పుడమి స్కూల్స్ నిర్వాహకులు కిరణ్‌రెడ్డి, ర్యాల భాస్కర్‌గుప్తా, రాములు, శ్రీశైలం, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి అదృశ్యం

క్రైం కార్నర్..



బత్తిని శ్రీనివాస్

జవహర్‌నగర్: వేర్వేరు ఘటనల్లో నలుగురు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ మార్కెట్ రోడ్డులో బత్తిని శ్రీనివాస్ (47) కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. శ్రీనివాస్ మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నెల 22న ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీనివాస్ ఇంటికి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భర్త మందలించడంతో..



ప్రమీల

జవహర్‌నగర్ సుక్కమ్మకుంటలో నివసించే బానోత్ నరేష్ భార్య ప్రమీల(25) ఇద్దరు కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ప్రమీల ఓ వ్య క్తితో ఫోన్ మాట్లాడుతుందని అనుమానం వచ్చిన న రేష్ ప్రమీలను మందలించాడు. ఈ నెల 22న ప్రమీ ల ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులుకు ఫిర్యాదు చేశారు.

మరో చోట విద్యార్థిని..

నాగారం లక్ష్మణ్, రేణుక దంపతులు పిల్లలతో కలిసి బాలాజీనగర్‌లో నివసిస్తున్నారు. ఆదివారం రేణుక, భర్తతో కలిసి మియాపూర్‌లోని చర్చికి వెళ్లారు. వీరి కుమార్తె శ్యామల అలియాస్ వైష్ణవి(15) కుషాయిగూడలోని ప్రభుత్వ పాఠశాలలో దూరవిద్యలో 10వ తరగతి చదువుతుంది. ఆదివారం పాఠశాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో ఎవరికీ చెప్పకుండా..



కీర్తనశ్రీ

ఉప్పల్‌కు చెందిన సునీత తన ఇద్దరు కుమార్తెలతో కలిసి దమ్మాయిగూడ రాజిరెడ్డినగర్‌లోని తన తల్లి సుశీల ఇంటికి వచ్చారు. సునీత పెద్ద కుమార్తె కీర్తనశ్రీ(22) సోమవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ కోసం తెలిసిన చోటల్లా వెతికినా అచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మేడ్చల్‌రూరల్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం చెరువులో లభ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శామీర్‌పేట్ మండలం మురహరిపల్లి గ్రామ పరిధిలోని మల్కంచెరువులో నీటిపై తేలుతూ స్థానికులకు కనబడటంతో వారు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు మృతదేహాన్ని బయటికి తీయగా కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.


ఖర్చులు ఫుల్..

ఖజానా నిల్!



- ఐదు నెలలుగా రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు లేక.. అప్పుల పాలు
- కేంద్రం విడుదల చేసిన నిధుల దారి మళ్లింపుతో సర్పంచుల్లో అసహనం

నగర శివారులోని మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని గ్రామ పంచాయతీల పరిస్థితి దా‘రుణం’



సాక్షి,మేడ్చల్ జిల్లా: గ్రామ పంచాయతీల్లో ఖర్చులు బాగా పెరిగిపోయాయి. నిధులు ప్రతి నెలా క్రమంగా విడుదల కాకపోవడంతో ఐదారు నెలలుగా చేసిన పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లా ల్లో విడుదలైన 15వ ఆర్థిక సంఘం కేంద్రం నిధులను అధికారులు సర్పంచులను సంప్రదించకుండానే పెండింగ్ బిల్లులకు చెల్లించడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ఆర్థిక సంఘం నిధులను కేంద్రం సూచించిన పనులకే వినియోగించాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో ఆగమేఘాలతో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలు పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లులు, ట్రాక్టరు వాయిదాలు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లించి, నిధులను పూర్తిగా ఖర్చు చేశారు. కొన్ని పంచాయతీల్లో సర్పంచులు అప్పులు చేసి మరీ పనులు చేయించారు. తీరా బిల్లు డ్రా చేసుకుందామంటే పెండింగ్ బిల్లులకు అధికారులు చెల్లింపులు చేయడంపై సర్పంచ్‌లు అసహనంతో ఉన్నారు.

నిధుల వినియోగం ఇలా..

పంచాయతీల్లో కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్‌సీ) వేర్వేరుగా బ్యాంకు ఖాతాల్లో జమవుతున్నాయి. వీటిని డ్రా చేసుకునేందుకు వేర్వేరుగా చెక్కులు జారీ చేయాల్సి ఉంటుంది. ఎస్ఎఫ్‌సీ కింద ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి నెలకు రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల చొప్పున గత ఆగస్టు వరకు నిధులు విడుదల చేసింది. ఐదు నెలలుగా రావడం లేదు. ఈ సమయంలో పంచాయతీల్లో జరిగిన పనులు, నిర్వహణ ఖర్చులకు సర్పంచులు, కార్యదర్శులు బిల్లులు చేసి ఉప కోశాధికారి కార్యాలయానికి పంపగా.. బడ్జెట్ లేక పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల కేంద్రం రెండు విడతలుగా 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు రూ.1.47 కోట్లు, రంగారెడ్డి జిల్లాకు రూ.4.57 కోట్లు విడుదల చేసింది. ఇందులో 60 శాతం టైడ్ గ్రాంట్స్ అంటే తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణకు ఖర్చు చేయాల్సి ఉంది. మిగతాది ఆన్‌లైన్ గ్రాంట్లు.. అంటే మురుగు కాల్వలు, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఐదు నెలలుగా రాష్ట్ర ఎస్ఎఫ్‌సీ నిధులు నిలిచిపోగా.. అదే సమయంలో కేంద్రం విడుదల చేయడంతో.. వీటిని పూర్తిగా వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు ఆదేశాలిచ్చింది. దీంతో ఎస్ఎఫ్‌సీ కింద బిల్లులు ట్రెజరీ వద్ద పెండింగ్‌లో ఉండగానే.. వాటి స్థానంలో కొత్తగా బిల్లులు తయారు చేసి పంపారు. ఇలా పెండింగ్ బిల్లులకు కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించారు.

పాత చెక్కుల రద్దుకు ఆదేశాలు..

15వ ఆర్థిక సంఘం నిధులను డ్రా చేసుకునేందుకు కొత్తగా చెక్కులను జారీ చేయడంతో పాత చెక్కులు ట్రెజరి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. పాత చెక్కులను రద్దు చేయకపోతే ఆవే బిల్లులకు రెండోసారి చెల్లింపులు జరిగే ప్రమాదముందని గ్రహించిన అధికారులు వాటిని రద్దు చేయాలని ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులకు తాజాగా ఆదేశాలు జారీ చేశారు. పాత బిల్లులకు సంబంధించిన చెక్కుల వివరాలు సేకరించి ట్రెజరీల వద్ద రద్దు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

సర్పంచులకు తెలియకుండానే..

అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాం. బిల్లులు ఐదు నెలల నుంచి ఖజానాలో పెండింగ్ ఉన్నాయి. ట్రాక్టర్ నిర్వహణ, నీళ్ల సరఫరా, ఇతర పనులకు రూ.లక్షలు ఖర్చయ్యాయి. పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను సొంత డబ్బులతో చెల్లిస్తున్నాం. ఐదు నెలల నుంచి బిల్లుల కోసం ఎదురు చూస్తున్నాం. ఇటీవల రెండు విడతలుగా కేంద్రం పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నుంచి విడుదల చేసిన మొదటి విడత నిధులను అధికారులు మాకు తెలియకుండానే కరెంటు బిల్లుల కింద చెల్లించారు. సర్పంచులకు సమాచారం ఇవ్వకుండా ఇష్టారీతిన ఖర్చు చేశారు.

– జి.సురేందర్ ముదిరాజ్, అధికార ప్రతినిధి, రాష్ట్ర సర్పంచుల ఫోరం